International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.3, Issue-4(1), April, 2016
Impact Factor: 3.075; Email: drtvramana@yahoo.co.in

# నామవిజ్ఞాన అధ్యయనం - జరిగిన కృషి

డా॥ అక్కెనపల్లి వెంకట్‌రాం రెడ్డి
ఉస్మానియా విశ్వవిద్యాలయం

నామాలను గూర్చి అధ్యయనం గావించేది గనుక ఇది నామ విజ్ఞానం. నామమంటే పేరు అని తెలిసిందే. ఈ పేరు వ్యక్తులది గావచ్చు, చెట్లు, పుట్టలు, జంతువులు, గ్రామాలు, వస్తువులు ఇలా ఏదైనా గావచ్చు. అయితే సాధారణంగా నామమనే పదం వ్యక్తులకు పరిమితమైనదిగా భావిస్తాం. కాని పై వాటికి కూడా వర్తిస్తుంది. ఇలా అన్ని నామాలకు అంటే పేర్లను గూర్చి చర్చించేది నామవిజ్ఞాన శాస్త్రం.

నామ విజ్ఞానాన్ని ఆంగ్లంలో 'ఓనమాస్టిక్సు' (Onomastics) అంటారు. ఈ పదం ఓనామా (Onoma) అనే లాటిన్ భాషాపదం నుండి ఏర్పడింది. 'ఓనామా' అంటే పేరు. ఓనమాస్టిక్సు అనే పదంతో పాటు, ఈ శాస్త్రాన్ని 'ఓనమాటాలజీ' (Onomotology) అని కూడా సంభావిస్తారు. ఓనమాస్టిక్సు, ఓనమాటాలజీ అనే రెండు పదాలు గ్రీకు భాషలో వున్నాయి. 'ది రాండమ్ హౌస్ డిక్షనరీ ఆఫ్ ది ఇంగ్లీషు లాంగ్వేజ్' (The Random House Dictionary of the English Language) అను నిఘంటువు పై పదాలను The study of the Origin and History of proper names, word gathering అనే అర్థాల నిచ్చింది అని Onomastic అంటే నామవిజ్ఞానమని, అందులో వ్యక్తి నామ విజ్ఞానాన్ని 'ఆంత్రోపోనమి' అంటారని, స్థల నామవిజ్ఞానాన్ని 'టోపోనమీ' అంటారని వివరించింది. అంతేగాక ఈ శాస్త్ర విషయ పరిధి చాల విశాలమని, అందులో సర్వ భాషావిషయాలు, భౌగోళిక సంబంధమైన, సాంస్కృతిక సంబంధమైన, చారిత్రక సంబంధమైన విషయాలు ఇమిడి వుంటాయని వివరించింది. ఒక విధంగా ఈ శాస్త్ర ప్రాముఖ్యాన్ని ఇది పట్టి ఇచ్చింది. దీనిని కొంత వివరిస్తే దీని ప్రాముఖ్యం అవగతమవుతుంది. పేర్లు వాటి ప్రాముఖ్యాన్ని అర్థం చేసుకోవడానికి, వాటి నేపథ్యాన్ని అర్థం చేసుకోవడానికి ఇది ఎంతో ఉపకరిస్తుంది.

మొదట దీనిని ఒక అధ్యయన విషయంగా గ్రహించినది అమెరికా దేశస్థులు. అక్కడ దీనిని మొదట ప్రారంభించిన వారు భాషావేత్తలు కారు. సామాజిక శాస్త్రవేత్తలు ( Anthropologists), మానవీయ శాస్త్రవేత్తలు (Sociologists), మొదట దీనిని ఒక అధ్యయనాంశంగా గ్రహించారు.

వారు కూడ మొదట స్థలనామాలపై తమ దృష్టిని కేంద్రీకరించారు. దీనికి కొంత నేపథ్యముంది. ఐరోపా ఖండం నుండి వివిధ దేశాల జాతులవారు అక్కడకు చేరుకోవడం ప్రారంభమైంది. మొదట వెళ్లిన వారు ఏర్పాటు చేసుకున్న ఆవాస ప్రాంతాలను, తరువాత వెళ్లిన వారు, వారిని తరిమివేసి, తమ ఆవాస ప్రాంతాలుగా చేసుకున్నారు. ఇలా ఒక జాతీయులు మొదట ఆక్రమించుకున్న ప్రాంతాలు చేతులుమారాయి. అలా మారినప్పుడు సహజంగా వాటి పేర్లు కూడా మారాయి. అంటే తమ భాషకు, తమ సంస్కృతికి సంబంధించిన పేర్లు పెట్టుకోవడం జరిగింది. ఇలా ఒకే ఆవాస ప్రాంతానికి కాలక్రమంలో అనతికాలంలోనే ఒకటికి మించిన పేర్లు వ్యాప్తిలోకి వచ్చాయి.

19వ శతాబ్దంలో, ఐరోపాఖండ మేధావులు, నామ విజ్ఞానశాస్త్రానికి గల భిన్న ముఖాలను గుర్తించి ఆసక్తి కనబరచసాగారు. అయితే దీని ప్రాముఖ్యాన్ని 1768 లో గుర్తించిన మొదటి ఐరోపా దేశీయుడు Gottfried Wilhem Leifring. శాస్త్రబద్ధమైన కృషి 1841 లో ప్రారంభమైంది. Fosterman రచించిన 'Altdeutsches Namenduch', ఇసాక్ టేలర్ రచించిన 'Words and Places' అనేవి ఈ దిశగా వచ్చిన మొదటి రచనలు. క్రీ.శ. 1871, క్రీ.శ. 1885 మధ్యకాలాన్ని స్థల నామవిజ్ఞాన శాస్త్ర పరిశోధనలో పురోగమనం సాగిన కాలంగా పరిగణిస్తాం. ఈ అధ్యయన కాలంలో ప్రముఖుడుగా నిలిచిన వ్యక్తి J.J. Elgi. ఇలా ఐరోపా దేశాల్లో విస్తృత పరిధిలో స్థలనామాలను 'సర్వే' చేయడం, సదస్సులు నిర్వహించడం కొనసాగించారు.

ఇక భారతదేశ విషయాన్ని పరికిస్తే మహాభారతంలోనే దీని మూలాలు కన్పిస్తాయి. హస్తినాపురం, కురుక్షేత్రం అనే పేర్లు ఎందుకు వచ్చాయో వివరణలున్నాయి. అలాగే రామాయణంలో దండకారణ్య ప్రదేశానికి ఆపేరు రావడానికి గల కారణాలు చెప్పబడ్డాయి. ఇది చాలా ప్రాచీన విషయం. ఈ ఆధునిక కాలంలో కూడ కొందరు పరిశోధకులు దీనిపై ఆసక్తిని కనబరచారు. 1945-46 లోనే శ్రీ కుందూరి ఈశ్వరదత్తు 'జర్నల్ ఆఫ్ ఆంధ్ర హిస్టారికల్ రీసెర్చ్ సొసైటి' లో భారతీయ స్థలనామ సంఘ స్థాపనను గూర్చి ప్రస్తావించారు. అదే విధంగా కోరాడ మహదేవ శాస్త్రి 'Personal Names in Old Telugu', ఆచార్య జి.ఎన్. రెడ్డి 'Place names studies and Folk-Loristics, బూదరాజు రాధాకృష్ణ 'Place names of Literature', చిలుకూరి నారాయణరావు 'Place names in the Anantapur District, కేతు విశ్వనాథరెడ్డి 'A need for Organising a Dravidian Placement Society', యార్లగడ్డ బాలగంగాధరరావు 'Indian Culture and Surnames', 'A note on place name study', వీటితోపాటు మరికొన్ని వ్యాసాలు ఆంగ్ల భాషలో ప్రచురించారు. ఇంకా అనేక వ్యాసాలు తెలుగులో ప్రచురించారు.

తెలుగు భాషలో ప్రచురించిన వ్యాసాలు. డా॥ నాయని కృష్ణకుమారి 'తెలుగులో ఊళ్లపేర్లు', డా॥ చిలుకూరి నారాయణరావు 'ఇంటిపేరు', శ్రీ ప్రసాదభూపాలుడు 'ఆంధ్రదేశంనందలి గ్రామ నామ సాంకేతికములు', డా॥ కె. రామచంద్రారెడ్డి 'నెల్లూరి జిల్లాలోని గ్రామనామాలు', డా॥ కేతు విశ్వనాథ రెడ్డి 'తెలుగు ఊర్ల పేర్లు అందలి అనుబంధ రూపములు, ఒక నమూనా పరిశీలన, తెలుగుదేశంలో ఊర్లపేర్లు'. శ్రీ మేరు సోమయాజుల వరహాలు 'ఇంటిపేరంటే, నామకరణం'. డా॥ అక్కెనపల్లి వెంకట్‌రాం రెడ్డి 'పేరులోనేమున్నది', మున్నగు వ్యాసాలు ప్రచురించారు.

ఇలా కొంత కృషి జరుగుతున్న సమయంలో, 70వ దశకంలో ఈ అధ్యయనాంశం పరిశోధనాంశంగా స్వీకరించబడింది. ప్రథమంగా ఆచార్య ఎస్వీ జోగారావు, శివలెంక శ్రీరామచంద్ర మూర్తి గారిచే శాసనస్థ గ్రామనామాలపై పరిశోధన చేయడానికి శ్రీకారం చుట్టారు. అటు పిమ్మట ఆచార్య జి.ఎన్.రెడ్డి, కేతు విశ్వనాథ రెడ్డి గారిచే కడప ఊళ్ల పేర్లపై పరిశోధన గావింప జేశారు. తదుపరి ఆచార్య తూమాటి దోణప్ప గారి పర్యవేక్షణలో వివిధ గ్రామనామాలపై పరిశోధన గావించి, సిద్ధాంత వ్యాసాలు సమర్పించి, డాక్టరేటు డిగ్రీలు పొందడం జరిగింది. అదే విధంగా ఈ మధ్యకాలంలో తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్ జిల్లా గ్రామనామాలపై పరిశోధన గావించి, డాక్టరేటు డిగ్రీని పొందిన యువ పరిశోధకుడు డా॥ అక్కెనపల్లి వెంకట్‌రాం రెడ్డి.

ఆచార్య జావరేగౌడ నేతృత్వంలో 'భారతీయ నామ విజ్ఞాన సంస్థ' (Place name Society of India) మైసూరు కేంద్రంగా 1983 లో స్థాపించారు. వివిధ విశ్వవిద్యాలయాలలో పరిశోధక విద్యార్థులు ఈ శాస్త్రంపై ముఖ్యంగా స్థలనామ విజ్ఞానం, గృహనామ విజ్ఞానంపై కృషి చేయడానికి పూనుకున్నారు. వివిధ విశ్వవిద్యాలయాలతో పాటు ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటి, కాకతీయ విశ్వవిద్యాలయం, తెలంగాణ విశ్వవిద్యాలయాలలో విస్తృత స్థాయిలో పరిశోధనలు జరుగుతున్నాయి. ఇంకా నామవిజ్ఞానంపై కృషి, సిద్ధాంత వ్యాసాలు క్షేత్రస్థాయిలో జరగాల్సిన అవసరం ఎంతైనా వుంది.

**ఆధార గ్రంథాలు :**

1. యార్లగడ్డ బాల గంగాధరరావు. "నామ విజ్ఞానం".
2. డా॥ కేతు విశ్వనాథ రెడ్డి. "కడప జిల్లా గ్రామ నామాలు".
3. డా॥ అక్కెనపల్లి వెంకట్‌రాం రెడ్డి. "నిజామాబాద్ జిల్లా గ్రామనామాలు – సాహిత్య చారిత్రక పరిశీలన" (సిద్ధాంత గ్రంథం).